సాక్షి రంగారెడ్డి

మంగళవారం : 11 : మార్చి : 2025




మహా ముదుర్లు!

మద్యం తాగి ట్రాఫిక్ అధికారులకు చిక్కకుండా మందుబాబులు అనేక మార్గాలు అనుసరిస్తున్నారు. 8లో▸



నిధులు కేటాయించండి

పెద్ద గోల్కొండ నుంచి మిడ్జిల్ వరకు డబుల్ జీటీ మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. 8లో▸



న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



తమసమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పిస్తున్న బాధితులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి సంగీత మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలపై నిర్లక్ష్యం తగదని అన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వారం 62 అర్జీలు అందాయని చెప్పారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 29, ఇతర శాఖలకు సంబంధించి 33 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై రాయితీని సద్వినియోగం చేసుకోండి



ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న చల్లా నర్సింహారెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకుంటే భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతులు సులభంగా వస్తాయని తెలిపారు. దళారులను ఆశ్రయించాల్సిన అవవసరం ఉండదన్నారు.

డబ్బికార్ శ్రీనివాస్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న డబ్బికార్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడమేగాక ఆధ్యాత్మికత, సామాజిక సేవ, విద్యా, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన ఆరెకటిక సంఘం జాతీయ నాయకుడు డబ్బికార్ శ్రీనివాస్ చేస్తున్న కృషిని గుర్తించి విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంగారు నంది అవార్డును ప్రదానం చేశారు. నగరంలోని రవీంద్ర భారతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, ఫౌండేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా నంది అవార్డును డబ్బికార్ శ్రీనివాస్ అందుకున్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని శ్రీనివాస్ తెలిపారు.

శిక్షలో శిక్షణలు.. ఉపాధికి బాటలు



శిక్షణను ప్రారంభిస్తున్న సంజయ్, సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: జైలు శిక్షలో భాగంగా వివిధ అంశాల్లో పొందిన శిక్షణ ఉపాధికి బాటలు వేస్తుందని ఉపాధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ అన్నారు. చంచల్‌గూడ మహిళా జైలులో ఖైదీలకు స్వయం ఉపాధి పథకం కింద ప్రవేశపెట్టిన టైలరింగ్ కోర్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కోర్సు వృత్తి నైపుణ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. జైళ్లను పునరావాస ప్రదేశాలుగా మారుస్తున్నాయన్నారు. సంకల్ప పథకం కింద నాక్ సంస్థల సహకారంతో ఈ కోర్సును అందిస్తున్నట్లు తెలిపారు.

రికవరీ.. ఏమైందో మరి!

ఫార్మాసిటీలో బినామీల పేరుతో ప్రజాధనం లూటీ

- ఇప్పటికే నకిలీలను తేల్చిన అధికారులు
- రికవరీతోపాటు చర్యలు తేసుకోవడంలో సర్కార్ తాత్సారం
- అక్రమార్కులను కాపాడుతున్నదెవరు?



కుర్మిద్ద గ్రామంలో ఫార్మాసిటీకి సేకరించిన అసైన్డ్ భూమిలో పాతిన టీఎస్ఐఐసీ బోర్డు

యాచారం: ఫార్మాసిటీలో బినామీల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లూటీ చేసిన రూ.కోట్లాది ప్రజాధనాన్ని రికవరీ చేసే విషయంలో ఫైలును ముందుకు కదలనీయకుండా సర్కార్‌లోని పెద్దలు కొందరు అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ హయాంలో ఫార్మాసిటీకి 19,333 ఎకరాలను సేకరించడానికి నిర్ణయించడం తెలిసిందే. అందులో భాగంగా యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో పది వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములను సేకరించడానికి నిర్ణయించగా 7,640 ఎకరాలు సేకరించి రైతులకు పరిహారం అందజేశారు. మొదట్లో జరిగిన భూసేకరణలో అసైన్డ్ పట్టా భూముల్లో సాగు (పట్టాదారు, పాసుపుస్తకాల్లో 5 ఎకరాలుంటే గుట్టలు, రాళ్లు, రప్పలు తీసేసి) యోగ్యమైన భూములకే పరిహారం ఇచ్చారు. తర్వాత అధికారులతో కుమ్మక్కైన కొందరు నకిలీలు, బినామీల పేర్లతో గుట్టలు, రాళ్లు, రప్పలున్న భూములపై పరిహారం పొందారు.

గ్రామాలకు సంబంధం లేనివారు సైతం..

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాటం చేస్తున్న వారిలో అత్యధికులు బినామీల పేర్లతో పరిహారం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత సర్కార్‌లోని ఓ కీలక నేత ఫిర్యాదుతో ఇంటెలిజెన్స్ ద్వారా నకిలీలు, బినామీల జాబితాను ప్రభుత్వం తెప్పించుకుంది. 2020 నుంచి 2023 వరకు నకిలీలు, బినామీలకు ఫార్మా పరిహారం పేరుతో రూ.కోట్లాది నిధులు మంజూరైనట్లు అధికారులు గుర్తించారు. 250 మందికిపైగా రూ.500 కోట్ల వరకు పరిహారం పొందారని తేల్చారు. పరిహారం పొందిన వారిలో స్థానికులే కాకుండా నల్లగొండ, హైదరాబాద్ జిల్లాలతో పాటు ఈ గ్రామాలకు సంబంధం లేని వ్యక్తుల పేర్లు సైతం ఉన్నట్లు తేలింది. నకిలీలు, బినామీల పేర్లతో పరిహారం పొందిన వారే ఇప్పుడు మళ్లీ ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్నట్లు జోరుగా చర్చలు సాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం నకిలీలు, బినామీల లిస్టు ఫైనల్ చేసిన అధికారులు నోటీసులు ఇచ్చి, రికవరీ చేసేలా ఫైలు కదిపినా ఏమైందో కానీ దాన్ని కప్పిపెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నోటీసులిస్తే తమ బండారం బయటపడుతుందనే భయంతో ఉన్నతాధికారులు జిల్లా అధికారులను వారిస్తున్నట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి.

ఫార్మా ప్లాట్ల లాటరీ అందుకే ఆలస్యం..

ఫార్మాసిటీ నకిలీలు, బినామీలు రూ.కోట్లాది పరిహారంతో పాటు మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ మెగా వెంచర్‌లో ప్లాట్ల సర్టిఫికెట్లు సైతం పొందారు. దాదాపు 500 ఎకరాలకుపైగా పరిహారం పొందిన బినామీలు 121 గజాలు, 242 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లు దక్కించుకున్నారు. ముందు జాగ్రత్తగా ప్లాట్లను అమ్మేసుకుంటున్నారు. 121 గజాల ప్లాటును రూ.8 లక్షలు, 242 గజాల ప్లాటును రూ.15 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు. నెల క్రితమే లాటరీ ద్వారా ఫార్మా ప్లాట్లను రైతులకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. లాటరీ ద్వారా ఎంపిక చేసి కబ్జాలిస్తే భవిష్యత్తులో చిక్కులొస్తాయనే భయం వారిలో నెలకొంది. నకిలీల ఏరివేత, డబ్బుల రికవరీ తర్వాతే ఎంపిక ప్రక్రియ, రిజిస్ట్రేషన్లు చేసి కబ్జాలు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది.



రెడీమిక్స్ ప్లాంట్‌ను మూసేయాలని ఆందోళన చేస్తున్న స్థానికులు (ఫైల్)

జనం నెత్తిన కాలుష్య భూతం!

- సాయంత్రం సీజ్.. ఉదయం కాంక్రీట్ తయారీ
- పీసీబీ ఆదేశాలను లెక్కచేయని రెడీమిక్స్ ప్లాంట్లు
- శంషాబాద్, కొత్వాల్‌గూడ, నార్సింగి, కోకాపేట్‌లో ఇష్టారాజ్యం
- అనుమతుల్లేని ప్లాంట్లకు అడ్డగోలుగా విద్యుత్ కనెక్షన్లు
- తరచూ ఆందోళనకు దిగుతున్న స్థానికులు..
- పట్టించుకోని అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నగర శివారు ప్రాంతాలను రెడీమిక్స్ కాంక్రీట్ రూపంలో కాలుష్యభూతం పట్టిపీడిస్తోంది. ఇళ్ల పక్కనే ఏర్పాటు చేసిన రెడీమిక్స్ ప్లాంట్లు వెదజల్లుతున్న కాలుష్యం స్థానికుల పాలిట శాపంగా మారుతోంది. వాతావరణంలో చేరిన దుమ్ము, ధూళి కణాలు, ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో ఆస్తమా బాధితులు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రెడీమిక్స్ ప్లాంట్లను జనావాసాలకు దూరంగా తరలించాలని స్థానికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేడు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపాలిటీలు, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నా బుట్టదాఖలవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడే స్వచ్ఛంద సంస్థలు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి, వాటి మూసివేతకు ఆదేశాలు జారీ చేయించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో వెలిసిన 21 రెడీమిక్స్ ప్లాంట్లను పీసీబీ అధికారులు ఇటీవల సీజ్ చేశారు. అయితే ఇలా సీజ్ చేసి... అధికారులు అలా ఇంటికి చేరుకునే లోపే మళ్లీ అవి తెరుచుకోవడం గమనార్హం.

111జీఓ పరిధిలోనూ ఆర్ఎంసీ ప్లాంట్లు

సైబరాబాద్ పరిధిలోని నార్సింగి, మణికొండ, వట్టినాగులపల్లి, ఖానాపూర్, కోకాపేట్, శంషాబాద్, కొత్వాల్‌గూడలో, గండిపేట, హిమాయత్‌సాగర్ పరిసరాలతోపాటు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అవుటర్ రింగ్ రోడ్డుకు అటు ఇటుగా ఉన్న తారామతిపేట్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ,, ఆదిభట్ల, కొంగర, తుక్కుగూడలోనూ పెద్ద సంఖ్యలో బహుళ అంతస్తుల నిర్మాణాలు, గెటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి. వీటికి సిమెంట్, కంకర, ఇసుక, స్టీలు పెద్ద మొత్తంలో అవసరమవుతోంది. నిజానికి ఏదైనా నిర్మాణ ప్రదేశంలో కానీ, ఇతర ప్రాంతంలో కానీ ఒక ఆర్ఎంసీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలంటే ముందు పరిశ్రమల శాఖ అనుమతి పొందాలి. ఆ తర్వాత రెవెన్యూ శాఖ, మున్సిపాలిటీల నుంచి గ్రీన్ సిగ్నల్ లభించాలి. శంషాబాద్, కొత్వాల్‌గూడ, గండిపేట్, హిమాయత్‌సాగర్ పరిసరాలన్నీ 111 జీఓ పరిధిలో ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు కానీ, పరిశ్రమలు కానీ ఏర్పాటు చేయవద్దనే ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. కానీ పలు నిర్మాణసంస్థలు తమకున్న రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని ఆయా శాఖల నుంచి అనుమతులు పొందకుండానే ఇష్టారాజ్యంగా ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాయి. అడిగినంత ముట్టజెప్పితే చాలు కరెంటోళ్లు కళ్లు మూసుకుని వాటికి కనెక్షన్లు ఇస్తున్నారు.

వీటిని సాకుగా చూపించి...

ఏదైనా బహుళ అంతస్తుల నిర్మాణాల ముడిసరుకును ఇతర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లలో తరలించాల్సి వస్తుంది. అధికలోడు వాహనాల కారణంగా రోడ్లు దెబ్బతింటున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని సాకుగా చూపించి, నిర్మాణ సంస్థలు తమ స్థలంలోనే రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటున్నాయి. చాలా రెడీమిక్స్ వాహనాలు నిర్మాణ ప్రాంగణం దాటి బయటికి వచ్చి ఇతర ప్రాంతాల్లోని నిర్మాణాలకు ముడిసరుకును చేరవేస్తున్నాయి. ఈ సమయంలో రోడ్లపై కంకర, సిమెంట్ జారిపడుతున్నాయి. దీంతో ఇతర వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

మచ్చుకు కొన్ని ప్లాంట్లు

ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి కొంగర కలెక్టరేట్ మార్గమధ్యలో ఏర్పాటు చేసిన రెడీమిక్స్ ప్లాంట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి కాంక్రీక్ రోడ్డుపై పడుతోంది. నిత్యం ఇదే రోడ్డు నుంచి జిల్లా ఉన్నతాధికారులంతా రాకపోకలు సాగిస్తుంటారు. అయినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఓఆర్ఆర్ వెంట వెలసిన కాంకీట్ యూనిట్‌కు వచ్చి పోయే వాహనాలతో సర్వీసు రోడ్డు దెబ్బతింటోంది.

- మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా అపార్ట్‌మెంట్ల మధ్య వెలసిన ఆర్ఎంసీ నుంచి వెలువడే కాలుష్యంతో వాతావరణం పూర్తిగా కాలుష్యమవుతోందని, అపార్ట్‌మెంట్ల పరిసరాలు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయని, ప్రజారోగ్యానికి హానికరంగా మారిన ఈ ప్లాంట్‌ను తక్షణమే మూసివేయించాలని ఇటీవల స్థానికులు పెద్ద సంఖ్యలో ధర్నాకు దిగారు.
- ఓఆర్ఆర్‌కు సమీపంలోని కోహెడ-బ్రాహ్మణపల్లి సరిహద్దులో ఏర్పాటు చేసిన రెడీమిక్స్ ప్లాంట్‌తో ఆ పరిసర ప్రాంతాలన్నీ దెబ్బతిన్నాయి. చుట్టు పక్కన ఉన్న పంటలు, ఖాళీ ప్లాట్ల నిండా సిమెంట్, డస్ట్ పేరుకుపోయాయి. తారమతిపేట, బాకారం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లోనూ ఈ ప్లాంట్లతోపాటు క్రషర్ మిషన్లు భారీగా ఏర్పాటయ్యాయి.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ

ఉద్యోగ నోటిఫికేషన్లు నిలిపివేయాలి

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యేంత వరకు అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఈ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాజీ జస్టిస్ షమీం అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీగా వర్గీకరించడం జరిగిందని అన్నారు. ఇందులో కొన్ని లోపాలున్నాయని, సవరించాలని కోరగా మార్చి 10 వరకు గడువు ఇచ్చినట్టు చెప్పారు. లోపాల సవరణ పూర్తి కాకుండానే ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉద్యోగాల నియామకాలకు నోటిఫికేషన్లు జారీ చేసిందని పేర్కొన్నారు. దీంతో మాదిగ, మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు భూషణ్, బొబ్బిలి పాండు, చెన్నగళ్ల శ్రావణ్, శ్రీనివాస్, జాంగారి జంగయ్య, సురేష్, శ్రీను, దశరథ్, ప్రేమ్‌కుమార్, కర్రోళ్ల శివకుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న భానుడు

భానుడు భగ్గుమంటున్నాడు. వాతావరణం వేగంగా మారిపోయింది. మార్చి నెల మొదటి వారంలోనే గరిష్ఠంగా 35 నుంచి 37.1 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత నమోదవుతూ వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాధారణం కంటే రెండు మూడు డిగ్రీల ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రత మరింత అధికంగా నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

– సాక్షి, సిటీబ్యూరో



విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘు నాయక్

- కాంగ్రెస్ ఆదివాసీ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్

షాద్‌నగర్: విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. షాద్‌నగర్ పరిధిలోని కొందుర్గులో నిర్మించే సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి అప్పుల పాలు చేసినా సీఎం రేవంత్‌రెడ్డి ఒడిదొడుకులు ఎదుర్కొంటూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు ఇబ్రహీం, బస్వం, వెంకట్‌రెడ్డి, హైదర్‌గోరి, నర్సింలుతదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకంలో వివక్ష వద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక, ఆంధ్రమహిళ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలబాలికలకు చిన్న వయస్సు నుంచే సమాన అవకాశాలు కల్పిస్తే అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం నేను ఆడపిల్లను -అందుకే తప్పక చదవాలి అనే శీర్షికతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందిచిన పోస్టర్‌ను సీతక్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డా.కరుణాదేవి, జనవిజ్ఞాన వేదిక నాయకులు రాజా, బీఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.వసుంధర రచయిత్రి జూపాక సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

'పవర్'ఫుల్!



- 11 కేవీ ఫీడర్లపై ఆన్‌లైన్ మానిటరింగ్
- కోతలు, సరఫరాలో హెచ్చుతగ్గుల గుర్తింపు కోసం ప్రత్యేక టెక్నాలజీ
- ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటుతో సమస్యలకు చెక్
- ఈనెల చివరి నాటికి రెండువేల ఫీడర్ల పరిధిలో అమలుకు సన్నాహాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు.. హెచ్చుతగ్గుల సమస్య తక్షణ గుర్తింపు.. పరిష్కారం కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే లైన్ టు లైన్, పోల్ టు పోల్ తిరిగి అధిక ఒత్తిడికి గురవుతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న ఇన్సులేటర్లు, ఫ్యూజ్ బాక్స్‌లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, లూజు లైన్లను గుర్తించి వాటిని 'సాసా' వెబ్ పోర్టల్‌లో పొందుపరిచిన డిస్కం.. తాజాగా 11 కేవీ ఫీడర్ల రియల్ మానిటరింగ్ కోసం 'ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం' (ఎఫ్‌ఓఎంఎస్)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తద్వారా ఏ ఫీడర్‌పై ఎంత ఒత్తిడి ఉంది.. ఏరోజు, ఎన్ని నిమిషాల పాటు సరఫరా నిలిచిపోయింది.. ఎంత సమయంలో సరఫరా పునరుద్ధరించారు.. వంటి పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతుంది. డిస్కం కేంద్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులతో పాటు క్షేత్రస్థాయిలోని ఏఈల మొబైల్ ఫోన్లకు ఈ సమాచారం వెళ్లిపోతుంది. దీంతో లైన్ల నిర్వహణ, పునరుద్ధరణ పేరుతో క్షేత్రస్థాయి ఇంజనీర్లు అడ్డగోలుగా అమలు చేస్తున్న ఎల్సీలకు చెక్ పడనుంది. అంతేకాదు ఫీడర్లపై పడుతున్న ఒత్తిడిని కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధిక ఒత్తిడి కారణంగా ఫీడర్లలో సమస్యలు తలెత్తకుండా ముందే జాగ్రత్తపడేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం తోడ్పతుంది.

అంతరాయాలకు ఆస్కారం లేకుండా..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 11 కేవీ ఫీడర్లు 3,412 వరకు ఉన్నాయి. ఒక్కో ఫీడర్ కొన్ని కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. ఫీడర్‌పై 25 నుంచి 50 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయి. ఒక్కో డీటీఆర్ పరిధిలో 50 విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. మెజార్టీ గృహ యజమానులు విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఒక కిలోవాటు, రెండు కిలోవాట్లకే పరిమితం అవుతుంటారు. ఆ తర్వాత ఏసీ, కూలర్లు, గ్రీజర్, రిఫ్రిజిరేటర్, మిక్సీ, టీవీ, ఫ్యాను.. ఇలా పదుల సంఖ్యలో ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. సామర్థ్యానికి మించి విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో ఆ భారం సమీపంలోని డీటీఆర్, సబ్ స్టేషన్లలోని ఫీడర్లపై పడుతోంది. పగటి ఉష్ణోగ్రతలకు తోడు అధిక విద్యుత్ వినియోగంతో తరచూ ఫీడర్ ట్రిప్పవుతోంది. సరఫరాలో అంతరాయాలకు కారణమవుతోంది. ఎఫ్‌ఓఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానంతో ఫీడర్‌పై భారం ముందే తెలిసిపోతుంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే అవకాశం లభిస్తుంది. తొలి దశలో మార్చి చివరి నాటికి 2000 ఫీడర్ల పరిధిలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చాలని నిర్ణయించారు. ఆ తర్వాతి దశల్లో మిగిలిన ఫీడర్ల పరిధిలోనూ ఈ రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయనున్నారు.

గ్రేటర్‌లో సర్కిళ్ల వారీగా ఉన్న ఫీడర్లు ఇలా..

సర్కిల్	11 కేవీ ఫీడర్లు
బంజారాహిల్స్	310
సైబర్‌సిటీ	437
హబ్సీగూడ	381
హైదరాబాద్ సెంట్రల్	307
హైదరాబాద్ సౌత్	323
మేడ్చల్	467
రాజేంద్రనగర్	588
సరూర్‌నగర్	330
సికింద్రాబాద్	269

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

- డిజిటల్ లావాదేవీలే సురక్షితం
- రిజర్వ్ బ్యాంకు అధికారి రెహమాన్



నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న రిజర్వ్‌బ్యాంకు అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాలను ఉపయోగించుకుని బ్యాంకు లావాదేవీలను కొనసాగించాలని రిజర్వ్ బ్యాంకు అధికారి రెహమాన్ అన్నారు. మార్చి 10 నుంచి 16 వరకు డిజిటల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఎల్మినేడు ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రిజర్వ్ బ్యాంకు అధికారులు ఎ.సావిత్రి, ఎ.రెహమాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజిటల్ టెక్నాలజీని సురక్షితంగా వినియోగించుకోవాలని సూచించారు. థర్డ్ పార్టీ యాప్‌ల జోలికి పోకుండా నేరుగా బ్యాంకులు సూచించిన యాప్‌ల సహకారంతోనే లావాదేవీలు కొనసాగించాలని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యతపై అందరికి అవగాహన అవసరమన్నారు. నగదు రహిత లావాదేవీలు చేసే సమయంలో సైబర్ మోసాల బారీన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల అధికారులు డిజిటల్ పేమెంట్స్‌పై ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీనియర్ బిజినెస్ మేనేజర్ ఎం.మురళీకృష్ణ, కె.సుధాకర్, బ్యాంక్ మేనేజర్ శిరీష్‌చంద్ర, ఎస్.నవీన్‌కుమార్, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి



మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న సీడీపీఓ తదితరులు

కేశంపేట: అనారోగ్యంతో ఓ అంగన్‌వాడీ టీచర్ మృతి చెందింది. ఈ ఘటన అల్వాల అనుబంధ గ్రామం తులవానిగడ్డలో సోమవారం చోటు చేసుకుంది. ఆమె మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఎల్గమోని రవీందర్‌యాదవ్, ఐసీడీఎస్ సీడీపీఓ షబనాహుస్సేన్, ఐసీడీఎస్ మాజీ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శమంతకమణి , పలువురు అంగన్‌వాడీ టీచర్లు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియలకు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం చెక్కును మృతురాలి కుటుంబ సభ్యులకు సీడీపీఓ అందజేశారు.

తెలంగాణ పోలీస్ జట్టులో ఇప్పాయిపల్లివాసి



వేణుగోపాల్

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వేణుగోపాల్ ఆల్ ఇండియా పోలీస్ వాలీబాల్ క్లస్టర్ పోటీల్లో సత్తాచాటుతున్నాడు. ప్రస్తుతం హర్యానాలో జరుగుతున్న పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా వేణుగోపాల్ సైబరాబాద్ కమాండ్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు.

యువకుడి అదృశ్యం



మధు (ఫైల్)

కేశంపేట: కుటుంబ సభ్యులతో గొడవపడిన యువకుడు అదృశ్యమైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, సీఐ నరహరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దిని మధు(25) చదువుకుంటూ గ్రామంలో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. జనవరి 3న డబ్బు కోసం కుటుంబ సభ్యులతో గొడవపడిన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గతంలోనూ పలుమార్లు గొడవ పెట్టుకుని వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని వెళ్లిన మధు కోసం కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం తల్లి పద్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్లిన నాడు జీన్స్ ప్యాంట్, బ్లూ ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్ ధరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు..

శంషాబాద్ రూరల్: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లికి చెందిన పెద్దరాజుల రామచంద్రయ్య(55) బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఈ నెల 9న వనపర్తి జిల్లా గోపాల్‌పేట్‌కు వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు పెద్దషాపూర్ శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ఘటనలో ముందు సీట్లో కూర్చున్న రామచంద్రయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న అతడి కుమారుడు భాస్కర్, బంధువు అలివేలుకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మందుబాబులు... మహా ముదుర్లు!

డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు తప్పించుకునే ప్రయత్నాలు

- పోలీసుల ఎత్తులకు పై ఎత్తులు
- ప్రత్యేకంగా కొన్ని వాట్సాప్ గ్రూపులు సైతం ఏర్పాటు
- ప్రాంతాల వారీగా తనిఖీ చేస్తున్న ఏరియాలు గుర్తింపు
- వాటిని లోకేషన్స్‌తో సహా గ్రూపుల్లో పోస్టు చేస్తున్న వైనం



సాక్షి, సిటీబ్యూరో: 'శత కోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు' అన్న నానుడిని నగరంలోని మందుబాబులు బాగా ఒంట పట్టించుకున్నట్లున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి చెక్ చెప్పడానికి ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. వీరికి చిక్కకుండా తప్పించుకోవడానికి 'నిషా'చరులు అనేక మార్గాలు అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసుకోవడం ఇటీవల పెరిగిందని పోలీసులు గుర్తించారు. దీనికి చెక్ చెప్పడానికి అవసరమైన మార్గాల కోసం అన్వేషిస్తున్నారు.

13 ఏళ్ల నుంచి కఠినంగా..

రోడ్డు ప్రమాదాలను సీరియస్‌గా తీసుకున్న ఐక్యరాజ్య సమితిలోని అంతర్భాగమైన డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ రోడ్ సేఫ్టీ పార్టనర్ షిప్ (జీఆర్ఎస్పీ) పేరిట అధ్యయనం చేపట్టింది. బ్లూమ్ బర్గ్ యూనివర్సిటీ, జాన్ హాకింగ్ వర్సిటీలతో కలిసి అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న 10 దేశాలను గుర్తిచడంతో పాటు వాటి నివారణకు ఆర్ఎస్–10 పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. ఆయా దేశాల్లో కొన్ని నగరాలను ఎంపిక చేసుకుని ప్రమాదాల నివారణకు అసరమైన ఉపకరణాలు అందించడంతో పాటు సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలు ఇచ్చింది. భారత్ నుంచి హైదరాబాద్‌తో పాటు జలంధర్ ఎంపికయ్యాయి. దీంతో 2011 నవంబర్‌లో సిటీ పోలీసులకు బ్రీత్ అనలైజర్లు 10, డిజిటల్ కెమెరాలు 220, బారికేడ్లు 250, రిఫ్లెక్టివ్ జాకెట్లు 550, ఎల్ఈడీ బేటన్స్ 450 అందాయి. అప్పటి నుంచి డ్రంక్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్స్ మొదలు కావడంతో పాటు 'నిషా'చరుల్ని కోర్టుకు తరలించడం సాధ్యమైంది. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ చిక్కిన వారికి జరిమానాలతో పాటు జైలు శిక్షలు పడటం మొదలైంది.

'బ్యాక్'తో మొదలై వాట్సాప్ వరకు..

ఈ స్పెషల్ డ్రైవ్స్‌లో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు 'నిషా'చరులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. తొలినాళ్లల్లో ఈ మందుబాబులు రహదారిలో ప్రయాణిస్తున్నప్పుడు ముందు తనిఖీలను గుర్తిస్తే వెంటనే తమ వాహనాన్ని వెనక్కు తిప్పుకుని రాంగ్ రూట్‌లో, లేదా పక్కన ఉన్న సందుల్లోకి జారుకునేవారు. దీనికి చెక్ చెప్పేందుకు ట్రాఫిక్ పోలీసులు 'ఫీల్డింగ్ టీమ్స్' ఏర్పాటు చేశారు. వీరు డ్రైవ్ జరుగుతున్న ప్రాంతానికి కాస్తా ముందు నుంచి కాపుకాసి ఇలా ఉడాయించే వారిని పట్టుకోవడం మొదలెట్టారు. దీంతో మందుబాబులు ఏరియాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి రోజూ వాటిలో తమ తమ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఈ డ్రైవ్స్ జరుగుతున్నాయో పోస్టు చేస్తున్నారు. కొందరు గ్రూపు సభ్యులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉండటంతో దాదాపు అన్ని ఏరియాల సమాచారం ఆ గ్రూపుల్లోకి వచ్చి, మద్యం తాగి ఉన్న వాళ్లు పోలీసులకు చిక్కకుండా జారుకుంటున్నారు.

చెక్ చెప్పేందుకు మార్గాల అన్వేషణ

ట్రాఫిక్ విభాగం అధికారులు ఈ డ్రంక్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకోవడానికి చేస్తున్న స్పెషల్ డ్రైవ్స్ సందర్భంలోనూ అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాహనచోదకులతో పాటు పోలీసులకు ఎలాంటి ముప్పు ఉండకూడదనే ఉద్దేశంతో రహదారి స్థితిగతులు తదితరాలను పరిశీలించి ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ ఏరియాలు ఒక్కో ట్రాఫిక్ ఠాణాలో గరిష్ఠంగా ఐదే ఉంటున్నాయి. మరోపక్క ఈ డ్రైవ్స్ చేపట్టడానికి బారికేడ్లు, టోవింగ్ వాహనం సహా మరికొన్ని సదుపాయాలు అనివార్యం. దీంతో పోలీసులు ఆకస్మికంగా వేర్వేరు ప్రాంతాల్లో ఈ డ్రైవ్స్ చేపట్టడం సాధ్యం కావట్లేదు. ఇవన్నీ మందుబాబులకు కలిసి వస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు గుర్తించారు. పోలీసులతో పాటు మద్యం మత్తులో వాహనం నడిపే వారికీ ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. 'నిషా'చరులు ఇలాంటి పై ఎత్తులు వేయడం వల్ల స్పెషల్ డ్రైవ్స్ స్ఫూర్తి దెబ్బతింటోందని చెబుతున్న పోలీసులు వీరిని కట్టడి చేయడానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

రోడ్డు మంజూరుకు నిధులు కేటాయించండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బొక్క నర్సింహారెడ్డి

కేశంపేట: మహేశ్వరం మండల పరిధిలోని పెద్ద గోల్కొండ (ఓఆర్ఆర్ ఎగ్జిట్) నుంచి మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ వరకు డబుల్ బీటీ రోడ్డు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దగోల్కొండ నుంచి కల్వకోలు వరకు రోడ్డు నిర్మాణం పూర్తయిందని, దానికి అనుసంధానంగా కల్వకోలు నుంచి మిడ్జిల్ వరకు డబుల్ బీటీ రోడ్డును నిర్మించాలని కోరారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే శ్రీశైలం, బెంగుళూరు హైవేలకు సమాంతరంగా ప్రత్యామ్నాయ రోడ్డు అవుతుందన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే తిరుపతి వెళ్లే ప్రయాణికులకు 130 కిలో మీటర్ల ప్రయాణ దూరం తగ్గుతుందని ఆయన కేంద్రమంత్రికి వివరించారు. రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇందుకు స్పందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రులు సానుకూలంగా స్పందించినట్లు నర్సింహారెడ్డి తెలిపారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్



చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వారు చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, చరణ్‌గౌడ్, చందు, చారి, వినీత్, ఆదిత్య, విష్ణుగుప్తా, ఇర్ఫాన్, వివేకానంద, శశి, ఆకాశ్, షోఫాయాన్, విష్ణు, శివ, నవీన్, కార్తీక్, మైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

రెండు ఇళ్లలో చోరీకి విఫలయత్నం



దుండగుడు ధ్వంసం చేసిన బీరువాలు

షాద్‌నగర్ రూరల్: పట్టణ శివారు కాలనీల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని గుర్తు తెలియని దుండగులు రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని తిరుమల మెగా టౌన్‌షిప్ కాలనీలో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన ప్రకారం.. తిరుమల మెగాటౌన్‌షిప్ కాలనీలో నివాసముండే రాజేష్, ఝాన్సీ దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు, కనకయ్య దంపతులు ప్రైవేటు ఉద్యోగస్తులు. ఉదయం వారు ఇళ్లకు తాళం వేసి తమతమ విధులకు వెళ్లిపోయారు. గమనించిన దుండగులు రాజేశ్ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని వస్తువులు చిందరవందర చేశాడు. ఏమీ దొరక్కపోవడంతో పక్కనే ఉన్న కనకయ్య ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించగా శబ్ధంరావడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు అక్కడకు వెళ్లే వరకే దుండగుడు పరారయ్యాడు. విధుల నుంచి వచ్చిన రాజేశ్ దంపతులు తాళం పగులగొట్టి ఉండడంతో డయల్ 100 నంబర్‌కు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరకుని సీసీ పుటేజీలు పరిశీలించారు. రాజేశ్, కనకయ్య ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడు ఒకడే అని గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బర్డ్‌ఫ్లూ కాదు.. కొక్కెర!

- నానక్‌నగర్ ఘటనపై స్పందించిన పశుసంవర్ధక శాఖ
- కోళ్లు అనారోగ్యానికి గురైతే సమాచారం ఇవ్వాలి
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

యాచారం: వైరస్ కారణంగా కోళ్లు అనారోగ్యానికి గురైనా.. మృతి చెందినా వెంటనే మండల పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. పది రోజుల క్రితమే అన్ని పౌల్ట్రీ ఫాంలలో పెంచుతున్న కోళ్లను పరీక్షించామన్నారు. నిత్యం పది నుంచి 20 కోళ్లు మృత్యువాత పడుతుంటాయన్నారు. మండల పరిధిలోని నానక్‌నగర్‌లో ఐదు రోజుల్లేనే 19 వేల కోళ్లు మృతి చెందడం ఆందోళన కలిగించే విషయమన్నారు. నానక్‌నగర్‌లో కోళ్లు మృతి చెందిన విషయమై ఆలస్యంగా సమాచారం అందడంతో సిబ్బంది వెళ్లలేకపోయారని.. వారు అక్కడకు వెళ్లేవరకు కోళ్ల కలేబరాలను పూడ్చేశారన్నారు. వ్యాధి నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను భోపాల్‌కు పంపాల్సి ఉంటుందని తెలిపారు. సరైన సమయంలో వ్యాక్సిన్ అందించకపోవడంతో కోళ్లకు కొక్కెర అనే సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. కొక్కెర వ్యాధితోనూ కోళ్లు రోజుల వ్యవధిలోనే వేలాదిగా మృతి చెందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ వ్యాధి సోకి కోళ్లు మృతి చెందితే కిలో మీటర్ వరకు ప్రభావం ఉంటుందని తెలిపారు. నానక్‌నగర్ కోళ్లు మృతి చెందిన పౌల్ట్రీఫాం షెడ్లకు కిలోమీటర్ దూరం లోపు పౌల్ట్రీఫాంలు లేవని సిబ్బంది సమాచారం ఇచ్చారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మరోమారు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని పశువైద్యాధికారులను ఆదేశించామన్నారు.

రికవరీ ఫోన్ల అప్పగింత



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్ఐ అనిత

ధారూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాలు, తండాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాధితులకు తొమ్మిది సెల్‌ఫోన్లను అప్పగించినట్లు ఎస్ఐ అనిత తెలిపారు.

నాలుగు టిప్పర్లు, జేసీబీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

కడ్తాల్: నిబంధనలకు విరుద్ధంగా మట్టితరలిస్తుండగా పోలీసులు దాడులు చేపట్టి వాహనాలను సీజ్ చేశారు. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని సర్వేనంబర్ 321/1లో ఉన్న ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి నాలుగు టిప్పర్లు, ఓ జేసీబీని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు జేసీబీ, టిప్పర్ డ్రైవర్లతో పాటు ఆయా వాహనాల యజమానులు మునావత్ శ్రీను(గానుగుమార్లతండా), నేనావత్ శ్రీను(పుల్లేరుబోడ్ తండా)పై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు, ఆటో ఢీ..

ముగ్గురికి గాయాలు



సాగర్ రహదారిపై ఢీకొన్న వాహనాలు

ఇబ్రహీంపట్నం: ఓ కారు, గూడ్స్ ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిలో గురునానక్ విద్యాసంస్థల సమీపంలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఓ ఆల్టోకారు, టాటాఏస్ గూడ్స్ వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో ఉన్న ఇద్దరు, ఆల్టోకారులో ప్రయాణిస్తున్న కానిస్టేబుల్ మహేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందకపోవడంతో పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు చెప్పారు.

వరద కాల్వను పూడుస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని సురంగల్ పెద్ద చెరువులోకి వచ్చే వరద కాల్వను పూడుస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సురంగల్‌కు చెందిన గడ్డం వెంకట్‌రెడ్డి తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సురంగల్‌లోని పెద్ద చెరువులోకి కనకమామిడి వైపు నుంచి వరదకాల్వ వస్తుందని.. నజీబ్‌నగర్ రెవెన్యూలోని సర్వే నెంబర్ 73, 74 వద్ద న్యాయవాది వలీ వరదకాల్వను పూర్తిగా పూడ్చివేసి తన పొలంలో కలుపుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే అతనిపై చర్యలు తీసుకుని కాలువ పూడ్చివేయడాన్ని అడ్డుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో జింక మృతి

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరి అడవుల్లో సోమవారం వీధి కుక్కల దాడిలో ఓ జింక(దుప్పి) మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఉదయం అడవిలో సంచరిస్తున్న జింక(దుప్పి)పై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. గమనించిన పలువురు వాటిని చెదరగొట్టారు. అనంతరం అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వారు వచ్చేలోపు జింకమృతి చెందింది.

ప్రియుడితో వెళ్లిపోయిన నవవధువు!

మణికొండ: వివాహం అయిన ఏడు రోజులకే ఓ నవవధువు మాజీ ప్రియుడితో వెళ్లిపోయిన ఉదంతం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీమందిర్ వద్ద మూడు రోజుల క్రితం జరిగింది. అతని చర్యను తను నివసిస్తున్న బస్తీ వాసులే వ్యతిరేకించి, అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించిన సంఘటన సోమవారం లంగర్‌హౌస్‌లో కలకలం సృష్టించింది. వివరాలివీ... నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీ మందిర్ వద్ద నివసిస్తున్న ఓ యువతి గతంలో లంగర్‌హౌస్‌లో నివసించే అరవింద్ అనే యువకుడిని ప్రేమించింది. తల్లితండ్రులు ఏడు రోజుల క్రితం ఆమెకు అత్తాపూర్‌కు చెందిన ఓ యువకుడితో వివాహం చేశారు. ప్రియుడితో కొనసాగిన ప్రేమాయణంతో ఆమె మూడు రోజుల క్రితం అతని వెంట వెళ్లిపోయింది. దాంతో తల్లిదండ్రులు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తమ కూతురు కనిపించటం లేదని ఫిర్యాదు చేశారు. అది విచారణ కొనసాగుతున్న క్రమంలోనే సోమవారం విషయం లంగర్‌హౌస్‌లోని అతని బస్తీలో తెలిసింది. దాంతో స్థానికులు అతను చేసిన చర్యను తీవ్రంగా వ్యతిరేకించారు. బస్తీలో అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించారు.

నిజాయతీ చాటిన ఆర్టీసీ ఉద్యోగులు



బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పరిగి: బస్సులో మరచిపోయిన బ్యాగును తిరిగి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు పరిగి ఆర్టీసీ ఉద్యోగులు. ఈనెల 7వ తేదీన రాత్రి పరిగి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు బయలు దేరింది. అందులో దినేష్ జైన్ అనే ప్రయాణికుడు తన బ్యాగును మరిచి మొయినాబాద్‌లో దిగిపోయాడు. దీంతో కండక్టర్ వెంకటయ్య, డ్రైవర్ సుధాకర్‌లు బ్యాగును గమనించగా..అందులో రూ.లక్ష నగదు ఇతర పేపర్లు ఉండటంతో ఎంజీబీఎస్‌లో ఆర్టీసీ అధికారులకు అందజేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు విచారించిన అధికారులు పోలీసుల సమక్షంలో బాధితుడికి నగదుతో ఉన్న బ్యాగును సోమవారం అందజేశారు. విధుల్లో నిజాయతీని చాటుకున్న ఉద్యోగులను డీఎం కరుణశ్రీ అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మియాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. నంద్యాల పట్టణానికి చెందిన సంగిరెడ్డి నర్సింహారెడ్డి (28) విష్ణుప్రియ దంపతులు మియాపూర్ పీఎస్ పరిధిలో ఆదిత్య నగర్ కృష్ణకాలనీలో నివాసముంటున్నారు. నర్సింహారెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం కుమారుడికి అన్నం తినిపించే విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన నర్సింహారెడ్డి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అతను ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో విష్ణుప్రియ స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా నరసింహారెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. అతడిని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య విష్ణుప్రియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.